ఏది గెలుపు

ఆమె వెళ్ళిపోయింది.

పదిహేను నిమిషాల క్రింద జరిగింది చెప్తాను.

వీడియోలో జేమ్స్‌బాండ్ 'నెవర్ సే - నెవర్ ఎగైన్' చూస్తున్నాను. కాలింగ్ బెల్ మోగింది. వెళ్లి తలుపు తీశాను. ఎదురుగా - ఆమె! ఆశ్చర్యంతో శిలలా అయిపోయాను.

"లోపలికి రానివ్వండి" సన్నగా నవ్వుతూ అంది. ఉలిక్కిపడి పక్కకు తప్పుకున్నాను. ఆమె లోపలికి వచ్చి టేబుల్ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది. వీడియో వాల్యూమ్ తగ్గించి, నేను బెడ్ చివరగా కూర్చున్నాను.

"చల్లకొచ్చి ముంత దాచటం కాకుండా సూటిగా చెప్తాను." కుర్చీని నా వైపు తిప్పుకుంది. టేబుల్ మీద గ్లాస్ పేపర్‌వెయిట్‌ని చేతిలోకి తీసుకుంది. "వారం నుంచీ మీరు ఈ హోటల్‌లో వున్నట్లు తెలుసు," నా కళ్ళల్లోకి చూస్తూ చెప్పింది... "నేను మిమ్మల్ని చేసుకోవాలనుకుంటున్నాను."

గుండె చిక్కపట్టినట్టైంది. నిలువు గుడ్లతో అలాగే చూస్తూ ఉండిపోయాను. నవ్వింది.... గాజు పెంకుల్ని సీసాలో గలగల లాడించినట్లు.

"ఎవరో కవి... వాక్యంలోనించీ జారి పడ్డ క్రియని పట్టుకుంటానన్నాడు. అలాగే నా వాక్యంలోనించీ జారిపోయిన పదాన్ని మీరు పట్టుకున్నారు కదా. అదేనండీ...పెళ్లి." అమె గలగలా మాట్లాడేస్తోంది. మళ్లీ చెప్పింది.."నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నాను. నా గురించి మీకు కొంత వరకూ తెలుసు గదా! మిగిలిన వివరాలు తీరిగ్గా ఆ తర్వాత చెప్తాను. మీ గురించి నేనేమీ అడగను."

నాకు తల దిమ్ముగా ఉంది. ఈ హఠాత్సంఘటన నుంచీ తేరుకోలేక పోతున్నాను. మాట్లాడకుండా కూర్చున్నాను.

ఆమె లేచి నిలబడింది. టీపాయ్ మీద జగ్‌లో నీళ్ళని గ్లాస్‌లోకి వంచి "తీసుకోండి," అంటూ నా ముందుంచింది. నేను గటగటా తాగేశాను. ఆ వెంటనే

అక్కడే వున్న ఫ్లాస్క్‌ని తీసుకుంది. మూత తీసి చూసింది. "అరె! టీ వుందే, గుడ్" అంటూ రెండు కప్పుల్లోనూ పోసింది. ఒకటి తను తీసికొని, ఒకటి నాకిచ్చింది. మంత్రముగ్ధుడిలా తాగేశాను. తనూ పూర్తిచేసింది. రెండు కప్పుల్నీ తీసి గోడ వారగా వున్న టేబుల్ మీద పెట్టింది.

క్షణాల తర్వాత ... "నే వెళ్ళొస్తాను. రేపు మాట్లాడుకుందాం మళ్ళీ," అంటూ నాటకంలో పాత్రలా నిష్క్రమించింది.

ఆమె చొరవకి ఆశ్చర్యపోయాను. నన్ను నేను సంబాళించుకున్నాను. తలుపు వేసి వచ్చి బెడ్ మీద పడుకున్నాను. "నా గురించి కొంతవరకూ తెలుసుకదా?" ఆమె మాటలు గుర్తుకొచ్చినై.

ఆలోచనల్లో వెనక్కి నడిచాను.

ఆరోజు...

ఉదయం ఆరు గంటలు...

నేను దాదర్ స్టేషన్‌లో ప్లాట్‌పారమ్‌మీద పచార్లు చేస్తున్నాను. మీనార్ ఎక్స్‌ప్రెస్‌లో మా అక్కయ్య రాధ, మేనల్లుడు రామం రావాలి. వాళ్ళని రిసీవ్ చేసుకోవటానికి స్టేషన్‌కి వచ్చాన్నేను. మీనార్ ఒక గంట లేటన్నారు.

లేడీస్ వెయిటింగ్ రూమ్ గుమ్మంలో నిలబడి పిల్చింది ఆమె. "సార్" అంటూ... ఆమె సల్వార్ కమీజ్‌లో వుంది. నడక ఆపి, అటుగా వెళ్ళాను. ఆమె పక్కగా మరో యువతి. నన్ను పిలిచిన అమ్మాయే చక్కటి ఇంగ్లీషులో అడిగింది. "ఈ వూళ్ళో ఒక ఫేమస్ సోప్ ఫ్యాక్టరీ వుంది. దాని అడ్రస్ తెలుసా సార్ మీకు?" ఒక్క క్షణం వాళ్ళని తేరిపార చూశాను. ఒకటి రెండు పేర్లు చెప్పాను. అవి కావని తల తిప్పింది రెండో యువతి. అసలు విషయమేమిటో వివరంగా చెప్పమన్నాను. మళ్ళీ మొదటి అమ్మాయే చెప్పింది.

"ఈమే నేనూ కొచ్చిన్ ఎక్స్‌ప్రెస్‌లో నుంచీ దిగాం. మాది కేరళా. ఇక్కడే సెటిలయ్యాం. ఈమెది ఆంధ్రాట. ఇక్కడ ఎవ్వరూ లేరు. ఈ నగరమూ తెలీదు. మొదటిసారి వస్తోంది. ఆ సోప్‌ల కంపెనీ వాళ్ళకి మోడలింగ్ చేయదానికి వచ్చిందట

పాపం అడ్రస్ తెచ్చుకోలేదు."

ఆశ్చర్యంగా చూశాను ఆ రెండో యువతి వైపు. ఇరవై రెండేళ్ళ వయస్సు. చక్కటి స్ఫురద్రూపం. కళ్ళల్లో చిత్రమైన మెరుపు. ముఖం ప్రయాణ బడలికితో వడలినా, ప్రసన్నంగా, ప్రశాంతంగా వుంది. ఎర్రంచు తెల్ల పూల చీర మీద ఎర్ర జాకెట్. చెవులకి పెద్ద పెద్ద రింగులు. మెళ్ళో ఒంటిపేట గొలుసు. దాని మధ్యన్న చిన్న లాకెట్‌ని మునిపంట ఆడుకుంటూ సన్నని సిగ్గుతో నాకేసి చూసింది ప్రాధేయపూర్వకంగా.

"ఏ వూరి నుంచి వచ్చారు?" అప్రయత్నంగా తెలుగులో అడిగాను.

"అరే మీరు తెలుగువాళ్ళా?" ఎంతో రిలీఫ్‌తో అడిగింది. ఎగిరి గంతేసినట్టైంది. "ఊ" అంటూ తలతాటించాను. "చిత్తూరు" చెప్పింది.

ఇంతలో ఆ కేరళ అమ్మాయి అంది "కొంచెం ఈమెకి సాయం చెయ్యండి సార్ మీరు. నే వెళ్ళొస్తాను. మా యింటికి చాలా దూరం పోవాలి. పైగా ఈ రోజు ఆఫీస్‌కి కూడా అటెండవ్వాలి నేను. ఎక్స్‌కూజ్‌మీ" అని నా సమాధానం కోసం ఎదురు చూడకుండా తన బాగ్ తీసుకుంది. "ఓకే నీలా, వస్తాను బై బెస్టాఫ్‌లక్" అంటూ చకచకా వెళ్ళిపోయింది.

నీలా, నేనూ నిలిచిపోయాం... "ఎట్లా? ఇప్పుడేం చేద్దాం? మీ దగ్గర వాళ్ళు రాసిన లెటరేమైనా వుందా? దానిమీద ఫోన్ నెంబరేదైనా వుందేమో"?

నా మాటలకి ఆమె అదోలా చూసింది. "ఆ కంపెనీ పేరే గుర్తులేక నేనేడుస్తుంటే లెటరంటారేమండీ. లెటరుంటే మిమ్మల్నెందుకు పిల్చేవాళ్ళం అసలు?"

ఆమె ప్రశ్నించిన తీరులో విసుగుదల కన్నా, "ఈ మాత్రం అర్థం చేసుకోలేవా ఫూల్?" అన్న ధ్వనే నాకు బాణంలా తగిలింది. ఆలోచనలో పడ్డాను.

"ఇక్కడ కూర్చుందాం రండి," అంటూ పక్కనున్న బెంచీ మీద కూలబడింది. నేనూ కూర్చున్నాను. "ఇంకా కొన్ని సోప్‌ల పేర్లు చెప్పండి" అంది. నేను వరసగా చెప్పుకుంటూ వెళ్ళాను. "ఆ... అదే... అదే" అని ఒక పేరుని పట్టుకుంది. "అవును అదే ఫ్యాక్టరీ" అంది. నేను హమ్మయ్య అనుకున్నాను.

ఇద్దరమూ బయటకి వచ్చాము. ఎదురుగా ఉన్న హోటల్లోకి నడిచాం. కాఫీకి అర్డరిచ్చి, టెలిఫోన్ డైరక్టరీ అడిగి తీసుకున్నాను. గబగబా పేజీలు తిరగేశాను. ఆమె నా పక్కగా జరిగి ఆత్రుతగా చూస్తూ వుండటం గమనించాను. ఆ పేరు మీద ఎలాంటి టెలీఫోనూ లేదు. సప్లిమెంట్‌లో కూడా చూశాను. అక్కడా కనపడలేదు. ఆమె వైపు చూస్తూ పెదవి విరిచాను.

హోటల్లో చాలా మంది మా వైపు పరీక్షగా చూడసాగేరు.

కాఫీ పూర్తిచేసి, మరి కొన్ని నిమిషాలు మౌనంగా కూర్చున్నాం. నాకొక ఆలోచన తట్టింది. లేచి బిల్ చెల్లించి బయటకు నడిచాను. ఆమె నన్ను అనుసరించింది.

టాక్సీ వాళ్ళు ఎదురొచ్చారు. ఆమే, నేనూ ఏదో అడ్రస్ కోసం వెతుకున్నామని పసిగట్టి ఏవో ప్రశ్నలు కురిపించారు. వాళ్ళని తప్పించుకొని స్టేషన్‌లోకి వచ్చాం.

"మీరు ఆ వెయిటింగ్ హాల్‌లోనే కూర్చోండి, వస్తాను" అంటూ మరోవైపు కదిలాను. లోలోపల నాకు ఆమె మీద చాలా కోపంగా ఉంది. పేరూ అడ్రసూ లేకుండా బొంబాయి లాంటి మహానగరానికి ఒంటరిగా ఎలా వచ్చినట్టు? ఎందుకు వచ్చినట్టు? ఇప్పటికే చాలా మంది మమ్మల్నీ, మా వాలకాన్నీ గమనించి అనుమానాస్పదంగా చూస్తున్నారు. ఆమెని అలాగే వదిలేసి, నేను నా పనిమీద వెళ్ళిపోతే, ఆమె గతి ఏమౌతుంది? నన్ను కాకుండా మరొకర్ని ఎవర్నైనా అడిగి వుంటే... ఏమయ్యుండేది? తప్పకుండా ఈ పాటికి మోసపోయి వుండేది. ఏవిటో ఆలోచనలు...

అప్పటికి తెరిచిన షాపుల్లో ఆ సబ్బుకోసం అడుగుతూ వెళ్ళాను. చివరికి ఒక షాపులో దొరికింది. కానీ, దానిమీద మద్రాస్ అడ్రస్ వుంది. నాలుగు రూపాయల అరవై పైసలిచ్చి దాన్ని తీసుకొని స్టేషన్‌కొచ్చాను.

ఆమె ఆ బెంచీమీదే కూర్చునుంది. నన్ను చూసి ఆత్రుతగాలేచి నిలబడింది. సోప్‌ని ఆమె చేతిలో వుంచుతూ అన్నాను " ఆ ఫ్యాక్టరీ మద్రాస్‌లో వుంది". ఆమె

నిజంగానే నీరు గారిపోయింది.

ఆ తర్వాత నా ప్రశ్నలూ, ఆమె సమాధానాలు కలిపితే ఇదీ సారాంశం... వాళ్ళది చాలా పెద్ద సంసారం. ఆరేళ్ళ క్రితం తండ్రి పోయాడు. రైల్వేలో గుమాస్తాగా చేసేవాడు. తల్లి వుంది. ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్ళూ, నలుగురు చెల్లెళ్ళూ. అన్నే బండి లాగిస్తున్నాడు.

ఏదో బ్యాంక్‌లో ప్యూను. అతనికి పెళ్ళయింది. నీల ఎనిమిదో తరగతి వరకే చదువుకుంది. పాడిపాడి ఇంగ్లీషు పదాలే తెలుసు. హిందీ రాదు. ఏదో పత్రికలో మోడలింగ్ గర్ల్స్ కావాలని చూసి బొంబాయి ప్రయాణమైంది.

అంతా విని కొంచెం కటువుగానే అన్నాను, "గొప్ప ఘనకార్యం చేశారు కానీ... పదండి. మాతో పాటు మా యింటికి రండి. ఆ తర్వాత ఆలోచిద్దాం. స్టేషన్ బయట మరెవరినైనా అడిగివుంటే... ఎవడో ఒకడు పట్టుకుపోయి, ఈపాటికి అమ్మేసి వుండేవాడు."

నీల నావైపు బిత్తరపోయి చూసింది.

"అవును.ఏవిటనుకొన్నారు. ఇది మహా నగరం. క్షణాల్లో మోసం చేస్తారు. అందులోనూ మీకు ఏ భాషా రాదు; చెప్పటానికి ఎవరి పేరూ తెలీదు," అన్నాడు.

నా మొహం లోకి చూసింది.... ఉన్నట్లుండి మేఘం వర్షించింది. కళ్ళనిండా నీళ్ళు. నేను కలవరపడ్డాను. అసంకల్పంగా నా అంత నేను పెద్దరికాన్ని ఆపాదించుకున్నాను. ఆమె భుజం తట్టూ "పిచ్చిపిల్ల, ఏం ఫర్వాలేదు. ఉండండుండండి. అది మాత్రం వద్దు. ఇది చూస్తే జనం నన్నూ మిమ్మల్నీ కదలనీరు. వెళ్లి లోపల కూర్చోండి. మా వాళ్లని తీసుకు వస్తాను" అని కదిలాను.

ఆమె తనని తాను సంబాళించుకొని సూట్‌కేస్‌తో లోపలికి వెళ్ళింది.

అప్పుడే మీనార్ వచ్చి ఆగింది. నేను మా వాళ్ళకోసం చకచకా నడవసాగేను

అక్కనీ, రామంనీ నీలకు పరిచయం చేసి, నీల గురించి టూకీగా వాళ్ళకి చెప్పాను. "ఈమె కూడా మనతో వస్తుంది" అన్నాను అక్కకేసి తిరిగి. నీల నా కళ్లలోకి చూసింది. ఆ చూపుల్లో ఎంతో కృతజ్ఞత!

ఆ సాయంత్రం నీల పడుకుని వుండగా అక్క చెప్పింది, "ఆ పిల్ల... వాళ్ళ వదిన నగలన్నీ తీసుకొని ఎవరికీ చెప్పకుండా వచ్చిందట. ఇంట్లో అవస్థలు చూడలేక సంపాదన కోసం వచ్చేసింది. తిరిగి ఇంటికి పోలేనని ఒకటే ఏడుస్తోంది," అని కొంచెం కోపంగానూ, నీలను కొద్దిగా తిట్తూనూ మాట్లాడింది. చివరికి "ఏం చేయాలో ఏమిటో," అంటూ ముగించింది.

నేనూ ఆలోచనలో పడ్డాను.

వారం రోజులు గడిచినై. ఈ వారం రోజుల్లోనూ అక్కా, రామంతో పాటు నీలకి కూడా సిటీ చూపించాను.

ఈ వారం మధ్యలో వోసారి పట్టాభిగారితో మాట్లాడాను. ఆయన నా శ్రేయోభిలాషీ, మంచిమనిషీ. ఆయనకి హైదరాబాద్‌లో ఒక ఆఫ్‌సెట్ ప్రెస్ వుంది. నీలకథ అంతా విని, ఆయన నీలని తనవద్దకు పంపమన్నాడు. ఆ రాత్రి నేను తృప్తిగా నిద్రపోయాను.

మర్నాడు నీల హైదరాబాదు వెళ్ళిపోయింది. ఆ తర్వాత పట్టాభిగారి దగ్గర ఆమె ఉద్యోగం గురించి తెలుసు నాకు. కొన్నాళ్ళ తర్వాత పట్టాభిగారు పోయారు. నీల ఉద్యోగం మానేసి మద్రాస్ వెళ్ళినట్లు తెలిసింది.

ఆరేళ్ళ క్రితం నీల గురించి నాకు తెలిసింది ఇదీ!!

ఇన్నాళ్ళ కిన్నాళ్ళకి మళ్ళీ ఇలా ప్రత్యక్షమైంది! ఇన్నేళ్ళకి వొక ఉప్పెనలా వచ్చింది! ఇవాళ... ఆ మనిషిలో ఎంత మార్పు!

నీల- ఆనాడు బేల; ఇవాళ జాణ! నీల - ఆనాడు మూగ బాసల బొమ్మ; ఇవాళ గలగలల కొమ్మ!

నీల తలపులతో ఆ రాత్రి నా నిద్రపోయింది!

మర్నాడు... నేను నా ఆఫీస్ పనులు చూసుకొని హోటల్ రూమ్‌కి చేరేసరికి రాత్రి ఎనిమిదైంది. స్నానం చేసి ఏదో మాగజైన్ చదువుతుండగా వచ్చింది నీల!

"ఏం సార్, రాత్రి మీ మనసంతా పాడు చేసి వెళ్లానా? ఎలా వున్నారు?" అడిగింది కూర్చుంటూ.

"ముందు మీ విశేషాలు చెప్పండి", అడిగాను.

"ఏం వున్నై. మీ దయ వల్ల ఇలా ఉన్నాను. ఈ హోటల్లోనే పనిచేస్తున్నాను," స్వచ్ఛమైన ఇంగ్లీషులో స్ఫుటంగా చెప్పింది. ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాను. "అవును, రెండేళ్ళ క్రితం ఎమ్మే చేశాను. ఇక్కడ చేరి వో నెలయింది. ఆరోజు బొంబాయిలో మీ అక్కగారన్న మాట గుర్తుందా? నేను నిద్రపోతున్నాననుకొని మీతో అన్నది ఆవిడ ... చదువూ సంధ్య లేకుండా ఏం చేద్దామని వచ్చిందో ఇలా. ఎందుకు పనికొస్తుంది ఇలాంటి పిల్ల... ఏ దిక్కుమాలిన పనో చేయడానికి తప్ప, అన్నారు. ఆ మాటలు నా గుండెల్లో శూలాల్లా గుచ్చుకొన్నై. ఆ వేళ నిర్ణయించుకొన్నాను. ఆ దిక్కుమాలిన పని చేయకపోవటమే కాదు... చదువుకొని నేనూ ఒక మనిషి నని నిరూపించుకోవాలని. నా పట్టుదల వల్ల అంతా సవ్యంగా జరిగింది."

నేను గుక్క తిప్పుకున్నాను. "హార్టియెస్ట్ కంగ్రాచ్యులేషన్స్" అన్నాను.

"నా జీవితానికి అర్థం, పరమార్థం చూపిన మీ కోసమే ఎదురు చూస్తున్నాను. జీతం బాగా వస్తుంది లెండి. మీకు తెలుసుగా ఇక్కడి ఉద్యోగాలు", అని వెంటనే టాపిక్ మారుస్తూ... "డిన్నర్‌ని రెస్టారెంట్‌లో చేద్దాం, రెడీ కండి" అంది.

నా మేధలో అనేక ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నై. ఏవేవో ప్రశ్నలు మొలకెత్తుతున్నై.

ఎదురుగా నా పట్ల ఆరాధనతో అగ్నికీలగా నీల! ఆశయ సాధనతో విజయ భావనతో వెలిగిపోతున్న జ్వాలగా... నీల!

నీల కుదుపుతో తెప్పరిల్లాను. ఆమె నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. "ప్లీజ్, నా ఆహ్వానాన్ని మన్నించండి. రండి" ఆర్ద్రంగా, అభ్యర్థన. చూపుల్లో చూపులు నిలిపింది. ఆమెలో ఎంతో ఉద్విగ్నత!

నెమ్మదిగా చేతిని విడిపించుకుని పక్కకు కదిలాను. ఉపకారాన్ని గురించీ, వారి మంచితనాన్ని గురించీ వివరంగా చెప్పి, అంది నీల

"ఎక్కడో సినిమాల్లో జరిగినట్లుగా జరిగింది నా జీవితంలో మీ పరిచయం.

అప్పట్నుంచీ మీ రూపును నా గుండెల్లో నిలుపుకున్నాను. కాదనరనే నమ్మకం నాకుంది"

డిన్నర్ తర్వాత సెలవు తీసుకుంటూ అంది, "ఇంకో నాలుగురోజులుంటారు కదా. కలుద్దాం మరి". నేను తలూపుతూ ఆగిపోయాను.

ఆ రాత్రే మా యం.డి.కి ఫోన్ చేసి, నా టూర్‌ని అంతటితో కాన్సిల్ చేయించుకున్నాను.

తెల్లవారుతూనే రూమ్ ఖాళీ చేసి బయల్దేరాను. నీల పేర నేను రాసిన లెటర్ రిసెప్షన్‌లో అందించి వెళ్ళాను. ఏం చెప్పగలను? "సారీ నీలా! నువ్వు ఎక్కవలసిన రైలు ప్లాట్‌ఫారం దాటి వెళ్ళిపోయింది!"

ఇంటికి వచ్చి నా శ్రీమతికి చెప్పాను నీలగురించి. అంతా విని వోరచూపుతో అన్నది శారద... "అందుకే మమ్మల్ని తక్కువగా అంచనా వెయ్యవద్దనేది నేను. చూశారా... నీల వ్యక్తి కాదు... శక్తి". 'కాబోలు'... అనుకున్నాను నేను.

అక్కకి ఉత్తరం వ్రాశాను... ఈ వివరాలన్నీ. ఆమె జవాబిచ్చింది, "అందుకే నేననేది...గుడ్డును పగలకొట్టకుండా ఆమ్లేట్ వేయలేమురా... అని. ఒక్కొక్కప్పుడు మాటల్లో కటువుగా ఉండటమూ మంచిదే."

ఆమె జాబుని చదువుకున్న తర్వాత కూడా మళ్ళీ నాలోనేను "కాబోలు!" అనే అనుకున్నాను!

***

(రచన సచిత్ర మాస పత్రిక జులై 1993)